


# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం


RNI Number
TELTEL/2023/85680

సంపుటి : 3 | సంచిక : 331 | జులై 30 గురువారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-










**మన దునియా,హనుమకొండ జిల్లా,కమలాపూర్:జులై 29**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని భీంపల్లి గ్రామంలో ఆర్ఎంపీల వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరతను ఆసరాగా చేసుకుని కొంతమంది ఆర్ఎంపీలు తమ పరిధిని దాటి వైద్య సేవలు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.సాధారణ ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితం కావాల్సిన వారు సెలైన్‌లు, ఇంజెక్షన్లు, వివిధ రకాల మందులు ఇవ్వడంతో పాటు తీవ్రమైన అనారోగ్యాలకు కూడా చికిత్స చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో అసలు వీరికి ఉన్న అర్హతలు ఏమిటి? చట్టబద్ధంగా ఎలాంటి వైద్య సేవలు అందించవచ్చు? ప్రస్తుతం అందిస్తున్న సేవలు నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. భీంపల్లిలో ఆర్ఎంపీల క్లినిక్‌లపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎప్పుడైనా తనిఖీలు నిర్వహించిందా? నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకున్నారా? లేక ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోవడం లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఇంత కీలకమైన అంశంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డి.ఎం.హెచ్.ఓ) మౌనం పాటించడం వెనుక కారణాలేమిటనే సందేహాలు వినిపిస్తున్నాయి. అధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, ఆర్ఎంపీల అర్హతలు, వారు


(మిగతా 2వ పేజీలో..)

## బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఎప్పటికీ క్షమాపణ చెప్పను: రాహుల్ గాంధీ

- అమిత్ షాపై రాహుల్ గాంధీ మరోసారి ఆరోపణలు
- క్షమాపణ చెప్పబోనని స్పష్టీకరణ
- విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారని ఆరోపణ
- మేకులున్న లాఠీలు, షాక్ బ్యాటన్ల ప్రస్తావన
- అమిత్ షా పోలీసులతో మాట్లాడారని వ్యాఖ్య
- రాహుల్ ఆరోపణలను ఖండించిన కేంద్రం

లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పేందుకు కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరాకరించారు. జంతర్‌మంతర్‌లో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాత్ర ఉందన్న ఆరోపణలను మరోసారి పునరుద్ఘాటించారు. “అమిత్ షానే ఆదేశాలు ఇచ్చి ఉండాలి.. లేకపోతే ఏం జరుగుతోందో ఆయనకు తెలియకపోయి ఉండాలి”

(మిగతా 2వ పేజీలో..)




## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్ సభ ఆమోదం



**మన దునియా,న్యూఢిల్లీ:జులై 29**

యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్సభ ఆమోదం తెలిపింది. మూజువాణి ఓటుతో ‘ది పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్ఫెయిర్ మీన్స్) అమెండ్మెంట్ బిల్లు’కు ఆమోదం లభించింది. విపక్షాలు పలు సవరణలు కోరినప్పటికీ.. అవి వీగిపోయాయి. పేపర్ లీక్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. అనంతరం సభ గురువారానికి వాయిదా పడింది.

(మిగతా 2వ పేజీలో..)

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది: కవిత

- సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదన్న కవిత
- టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్న
- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం ద్వారా

(మిగతా 2వ పేజీలో..)




## నీటి ఎత్తిపోతల ప్రారంభం ??

- రైతుల గోస చూసి వానదేవుడే కరిగిపోయాడు..
- కాళేశ్వరం జలాలతో నిండుతున్న ప్రాజెక్టులు: హరీశ్ రావు
- నాడు కాళేశ్వరం కుళేశ్వరం అన్నారు.. నేడు అదే ప్రాజెక్టు బాహుబలి మోటార్లను ఆన్ చేస్తున్నారు
- కాళేశ్వరం అనుసంధాన పంపుహౌస్‌లలో ఎగసిపడుతున్న జలాలు..
- ఇది కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనం

**మన దునియా,హైదరాబాద్: జులై 29**

హైదరాబాద్: రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చివరకు వానదేవుడే కనికరించాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య పాలనతో రైతులు సాగునీటి కోసం ఆందోళన చెందుతున్న సమయంలో, ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోకి భారీగా వరద జలాలు చేరుతున్నాయని ఆయన

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్ సభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ బిల్లుపై చర్చలో భాగంగా ఆయా పార్టీల సభ్యులు మాట్లాడిన అనంతరం.. చివరగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్కు అవగాహన లేదని, ప్రభుత్వం ఎలా నడుస్తుందో ఆయనకు తెలియదని మండిపడ్డారు.2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 52 ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకైన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, అనుభవాల నుంచి నేర్చుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనడానికి పేపర్ లీక్ నిరోధక సవరణ బిల్లు నిదర్శనమన్నారు.

## భీంపల్లిలో ఆర్ఎంపీల అర్హత ఏంటి..?

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్న వైద్య సేవలపై వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. భీంపల్లిలో ఆర్ఎంపీల వ్యవహారంపై డి.ఎం.హెచ్.ఓ స్పందిస్తారా...? నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తేలితే చర్యలు తీసుకుంటారా...? లేక ఈ వ్యవహారం కూడా ప్రశ్నలుగానే మిగిలిపోతుందా...?

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది: కవిత

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ (ఖ్రాఖూజా) బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు.సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.జెన్కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.

## బీజేపీ, ఆర్ఎస్ఎస్కు ఎప్పటికీ క్షమాపణ చెప్పను: రాహుల్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.పార్లమెంట్ సమావేశం వాయిదా పడిన తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. క్షమాపణ చెబితే ప్రసంగం కొనసాగించేందుకు అవకాశం ఇస్తామని తనకు చెప్పారని, కానీ బీజేపీకి, ఆర్ఎస్ఎస్కు తాను ఎప్పటికీ క్షమాపణ చెప్పబోనని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా దేశానికి సంబంధించిన కీలక అంశాలను లేవనెత్తే హక్కు తనకు ఉందని అన్నారు.నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారని రాహుల్ ఆరోపించారు. ఒక విద్యార్థి కంటి చూపు కోల్పోయే పరిస్థితి వచ్చిందని, దీనికి సంబంధించిన ఎయిమ్స్ వైద్య నివేదికను తాను చూశానని చెప్పారు. మేకులున్న లాఠీలు, షాక్ బ్యాటన్లతో మహిళలు, మైనర్లపై కూడా దాడులు చేశారని ఆరోపించారు. నిరసన సమయంలో అమిత్ షా పోలీసు అధికారులతో మాట్లాడడం తాను స్వయంగా చూశానని కూడా పేర్కొన్నారు. ఆ తర్వాత జితేంద్ర సింగ్ కు అమిత్ షా నుంచి వరుసగా కాల్స్ వచ్చాయని అన్నారు.అంతకుముందు లోక్సభలో రాహుల్ చేసిన ఆరోపణలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలకు ఆధారాలు చూపాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. స్పీకర్ ఓం బిర్లా కూడా ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయొద్దని సూచించారు. మరోవైపు రాహుల్ ఆరోపణలను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పూర్తిగా ఖండించారు. నిరసనల సమయంలో కాల్పులు జరగలేదని, అలాంటి ఆదేశాలు కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు.

# నీటి ఎత్తిపోతల ప్రారంభం ??

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులో అనుసంధానమైన నంది, గాయత్రి పంప్హౌస్ల పరిధిలో జలాలు ఉధృతంగా ప్రవహిస్తూ ఎగసిపడుతున్నాయని, ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీలు, రిజర్వాయర్లు నీటితో కళకళలాడుతున్నాయని హరీశ్ రావు అన్నారు. ప్రకృతి సహకరించడంతో కాళేశ్వరం ప్రాజెక్టు సామర్థ్యం మరోసారి ప్రజలకు కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు."రైతుల గోసను చూసి చివరకు వానదేవుడే కనికరించాడు. రేవంత్ రెడ్డి సర్కారు రైతుల కష్టాలను పట్టించుకోకుండా దౌర్భాగ్య పాలన సాగిస్తుంటే, ప్రకృతి మాత్రం రైతుల పక్షాన నిలిచింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని అనుసంధాన పంప్హౌస్ల వద్ద జలాలు ఎగసిపడుతున్నాయి. నిండుకుండల్లా నీటి వనరులు కళకళలాడుతున్నాయి" అని హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును అధికారంలోకి వచ్చిన వెంటనే విమర్శించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు అదే ప్రాజెక్టు నీటిపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఎద్దేవా చేశారు. నాడు కాళేశ్వరం కుళేశ్వరం అంటూ విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి.. నేడు అదే కాళేశ్వరం ప్రాజెక్టులోని బాహుబలి మోటార్లను ఆన్ చేసి నీటిని ఎత్తిపోస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు."కాళేశ్వరం పనికిరాదన్నారు.. కుళేశ్వరం అన్నారు.. కానీ ఇప్పుడు అదే కాళేశ్వరం నీళ్లు కావాలి. నాడు విమర్శించిన బాహుబలి మోటార్లనే నేడు ఆన్ చేస్తున్నారు. ఇదే కాళేశ్వరం ప్రాజెక్టు అవసరాన్ని, కేసీఆర్ దూరదృష్టిని చాటి చెబుతోంది" అని హరీశ్ రావు అన్నారు.కేసీఆర్ ప్రభుత్వం హయాంలో భవిష్యత్తులో వచ్చే కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెక్డ్యామ్లు నిర్మించడంతో పాటు చెరువుల పునరుద్ధరణ చేపట్టామని ఆయన గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు సాగునీరు అందించాలన్నది కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం పరిధిలోకి భారీగా నీరు చేరుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అందుబాటులో ఉన్న నీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. నంది, గాయత్రి పంప్హౌస్లతో పాటు కాళేశ్వరం అనుసంధాన వ్యవస్థలను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచి, అవసరమైన చోట్ల నీటిని ఎత్తిపోసి చెరువులు, రిజర్వాయర్లు నింపాలని సూచించారు. "నీరు అందుబాటులో ఉన్నప్పుడే రైతులకు అందించాలి. ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టి సాగునీటి అవసరాలకు వినియోగించాలి. వర్షాలు తగ్గిన తర్వాత నీటి కోసం రైతులు ఇబ్బందులు పడకుండా ఇప్పటి నుంచే ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలి" అని హరీశ్ రావు కోరారు."నాడు కాళేశ్వరాన్ని తిట్టారు.. నేడు అదే కాళేశ్వరాన్ని నమ్ముకున్నారు. నాడు బాహుబలి మోటార్లను విమర్శించారు.. నేడు అదే మోటార్లను ఆన్ చేస్తున్నారు. నంది, గాయత్రి పంప్హౌస్ల వద్ద ఎగసిపడుతున్న జలాలు కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యతను మరోసారి చాటిచెబుతున్నాయి. ఇది కేసీఆర్ దూరదృష్టి.. ఇది రైతుల కోసం చేసిన అభివృద్ధి" అని హరీశ్ రావు అన్నారు. రైతుల ప్రయోజనాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు జలాలను పూర్తిస్థాయిలో వినియోగించి, రాష్ట్రంలోని చెరువులు, రిజర్వాయర్లు నింపి రైతాంగానికి సాగునీటి భరోసా కల్పించాలని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కేంద్రానికి ఎల్ఐసీ భారీ కానుక.. రూ.12,207 కోట్ల డివిడెండ్

**ఎల్ఐసీ నుంచి రూ.12,207 కోట్ల డివిడెండ్**
**యూనియన్ బ్యాంక్ నుంచి రూ.2,853 కోట్లు**
**న్యూ ఇండియా అష్యూరెన్స్ నుంచి రూ.211 కోట్లు**
**పీఎస్బీల జీఎన్పీఏ 1.9 శాతానికి తగ్గుదల**
**ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లు**



కేంద్ర ప్రభుత్వానికి ప్రభుత్వ రంగ సంస్థల నుంచి భారీగా డివిడెండ్లు అందుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసీ రూ.12,207 కోట్ల డివిడెండ్ను కేంద్రానికి అందించింది. అదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ రంగ బీమా సంస్థల పనితీరు కూడా గణనీయంగా మెరుగుపడింది. మొండి బకాయిలు చారిత్రక కనిష్ఠానికి చేరగా, లాభాలు కొత్త రికార్డు నెలకొల్పాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్కు ఎల్ఐసీ ఎండీ, సీఈఓ ఆర్. దొరైస్వామి రూ.12,207 కోట్ల డివిడెండ్ చెక్కును బుధవారం అందజేశారు. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అలాగే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ అశీష్ పాండే రూ.2,853 కోట్ల డివిడెండ్ చెక్కును అందించారు. న్యూ ఇండియా అష్యూరెన్స్ సీఎండీ గిరిజా సుబ్రహ్మణియన్ రూ.211 కోట్ల డివిడెండ్ను అందజేశారు. ప్రభుత్వ రంగ సంస్థల బలమైన ఆర్థిక పనితీరుకు ఇవి నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది. ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక స్థితిపై కూడా కేంద్రం వివరాలు వెల్లడించింది. 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్పీఏ) నిష్పత్తి 1.9 శాతానికి పడిపోయింది. ఇది ఇప్పటివరకు నమోదైన కనిష్ఠ స్థాయి. మరోవైపు ఈ బ్యాంకుల ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లకు చేరింది. వరుసగా నాలుగో ఏడాది లాభాలను నమోదు చేయడం విశేషం. సంస్కరణలు, మెరుగైన పాలన, బలమైన మూలధన స్థితి ఈ ఫలితాలకు ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభం ఏడాది ప్రాతిపదికన 11.1 శాతం పెరిగింది. రుణాల వృద్ధి, వడ్డీ ఆదాయం పెరగడం, ఆస్తుల నాణ్యత మెరుగుపడటం లాభాలకు బలాన్నిచ్చాయి. 2026 మార్చి 31 నాటికి ఈ బ్యాంకుల మొత్తం వ్యాపారం రూ.283.3 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 12.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. మార్చి 31 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర నిరర్థక ఆస్తుల (ఎన్పీఏ) నిష్పత్తి 0.39 శాతానికి తగ్గింది. ప్రతి ప్రభుత్వ రంగ బ్యాంకు 90 శాతానికి పైగా ప్రొవిజనింగ్ కవరేజ్ రేషియోను కొనసాగించింది. రుణాల మంజూరులో మెరుగైన ప్రమాణాలు, సమర్థమైన రిస్క్ మేనేజ్మెంట్ బ్యాంకుల ఆర్థిక బలాన్ని మరింత పెంచాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## తమిళనాడు స్కూళ్లలో ఘుమఘుమలు.. మధ్యాహ్న భోజనంలో చికెన్ బిర్యానీ ప్రతిపాదన

పాఠశాల విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించడంతో పాటు భోజనాన్ని ఆసక్తికరంగా మార్చేందుకు తమిళనాడులోని విజయ్ ప్రభుత్వం ఒక కీలక ప్రతిపాదనను పరిశీలిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి ఒకసారి 'చికెన్ బిర్యానీ' అందించే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తోంది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే, దేశంలోనే సుదీర్ఘకాలంగా అమలవుతున్న ఈ పథకంలో ఇదొక ముఖ్యమైన మార్పు అవుతుంది.ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న సాంఘిక సంక్షేమ, మహిళా సాధికారత శాఖతో సంప్రదింపులు జరిపిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. వారానికి ఒకసారి ప్రోటీన్లు అధికంగా ఉండే చికెన్ బిర్యానీని అందించడం వల్ల విద్యార్థుల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.దీంతో పాటు భోజనం నాణ్యతను, ముఖ్యంగా పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతను మెరుగుపరిచే అంశంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం తమిళనాడులో 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 40 లక్షల మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. అలాగే ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా 1 నుంచి 8వ తరగతి వరకు 32 లక్షల మంది పిల్లలకు ప్రయోజనం చేకూరుతోంది.ఈ రెండు పథకాలను 11, 12 తరగతులకు కూడా విస్తరించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. దీనివల్ల మరో 8 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని అంచనా. హయ్యర్ సెకండరీ విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం వల్ల వారి హాజరు మెరుగుపడి, డ్రాపవుట్లు తగ్గుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశంలో ఇలాంటి పథకాలకు మార్గదర్శకంగా నిలిచిన తమిళనాడు, చికెన్ బిర్యానీ ప్రతిపాదనతో మరో ముందడుగు వేసినట్టు అవుతుంది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జులై | గురువారం | 30 | 2026


# భారీ వర్షాలు.. తెలంగాణలోని ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ




**మన దునియా,హైదరాబాద్: జులై 29**

రాష్ట్ర వ్యాప్తంగా గత 24 గంటలుగా విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి.ఎడతెరిపి లేకుండా కురిసిన వానలతో లోతట్టు ప్రాంతాలు జలమయమవగా, పలు రహదారులపై వర్షపు నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించడంతో ఉద్యోగులు, ప్రయాణికులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం హీరాపూర్‌లో నమోదైంది. అక్కడ 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, తాంసి, తలమడుగు, ఇచ్చోడ, భోరజ్, మావల మండలాల్లో 4.2 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 4 సెంటీమీటర్లు, వరంగల్ జిల్లా చెన్నారావుపేటలో 3.8 సెంటీమీటర్లు, కామారెడ్డి జిల్లా మొహమ్మద్‌నగర్ మండలం మొగ్దంపూర్‌లో 3.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట తదితర జిల్లాల్లో కూడా మంచి వర్షాలు కురిశాయి. సోమవారం రాత్రి మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో అత్యధికంగా 8.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలపై ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కొనసాగుతున్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ వాయుగుండం బుధవారం నాటికి దక్షిణ ఝార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ-వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే రుతుపవన ద్రోణి ఆగ్నేయ దిశగా ఈశాన్య బంగాళాఖాతం వరకు విస్తరించి ఉండటంతో రాష్ట్రంలో వర్షాలకు అనుకూల పరిస్థితులు కొనసాగుతున్నాయని వివరించింది. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్రంలోని పది జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.ఆయా జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశముందని తెలిపారు. గురువారం, శుక్రవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని, లోతట్టు ప్రాంతాలు, వాగులు, నాలాల సమీపంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు కొనసాగే అవకాశం ఉన్నందున వాహనదారులు ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వైద్యుల సేవలు చిరస్మరణీయం






**కేఎన్ఆర్‌యూహెచ్ఎస్ వీసీ డాక్టర్ రమేష్ రెడ్డి, లయన్ డిస్ట్రిక్ట్ 320 ఎఫ్ గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి , డాక్టర్స్ హానరింగ్ చైర్మన్ డాక్టర్ వైద్యం గౌతమ్**

**1000 పిల్లర్స్ లయన్స్ ఆతిథ్య క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డే**

**60 మంది వైద్యులకు ఘన సత్కారం.**

**మన దునియా,వరంగల్ జిల్లా: జులై 29 వరంగల్:**

సమాజానికి ప్రాణదాతలుగా నిలుస్తూ, నిస్వార్థ సేవనందిస్తున్న వైద్యుల సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కే.రమేష్ రెడ్డి అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వరంగల్ కేఎంసీ క్యాంపస్‌లోని ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో డాక్టర్స్ డే' వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.'లయన్స్ క్లబ్ సంక్షేమం,క్లబ్ హెచ్ఎన్‌కే థౌసండ్ పిల్లర్స్'సంయుక్త ఆతిథ్యంలో "హార్ట్‌ఫుల్ సర్వీస్ - హ్యాపీ ఫేసెస్"నినాదంతో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సమాజానికి అంకితభావంతో సేవనందిస్తున్న పలువురు ప్రముఖ వైద్యులను ఘనంగా సత్కరించారు. డాక్టర్స్ హానరింగ్ చైర్మన్ లయన్ డాక్టర్ వైద్యం గౌతమ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో, డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి ప్రారంభోత్సవ అధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ వైద్యులు లేని సమాజాన్ని మనం ఊహించలేమన్నారు. లయన్స్ జిల్లా గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి డాక్టర్స్ డే వేడుకలను ప్రారంభిస్తూ సమాజంలోని ముఖ్య వృత్తులలో ఉన్న వారిని గుర్తించి ప్రోత్సహించడం తమ కార్యక్రమాల్లో ప్రత్యేక భాగం అన్నారు. అందులో భాగంగా ఈరోజు ఉమ్మడి జిల్లాలోని పేరెన్నిక కన్నా 60 మంది వైద్యులను సత్కరింప చేస్తున్నామని చెప్పారు. ఈ వేడుకల్లో భాగంగా.. ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ పి. హరికిషన్ రెడ్డి, సెకండ్ వైస్ గవర్నర్ లయన్ రేవురి రమణ రెడ్డి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ అడ్వైజర్ పీసీజీ లయన్ ఎన్.వెంకటేశ్వర రావు, చీఫ్ అడ్వైజర్ పీసీజీ లయన్ ముచ్చ రాజి రెడ్డి, జీఏటీ అడ్వైజర్ పిడిజి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు లయన్ కుందూరు వెంకట్ రెడ్డి, లయన్ పొట్లపల్లి శ్రీనివాస్ రావు, లయన్ టి.లక్ష్మీనర్సింహ రావు, లయన్ లయన్ డాక్టర్ కే. సుధాకర్ రెడ్డి, లయన్ డాక్టర్ కే.రాజేందర్ రెడ్డి, లయన్ డాక్టర్ డి.లవ కుమార్ రెడ్డి తదితరులు వేడుకలను శోభాయమానం చేశారు. డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ పాము శ్రీనివాస్, ట్రెజరర్ లయన్ చొప్పరి సోమయ్య; రీజినల్ చైర్మన్లు లయన్ పబ్బ చంద్రమోహన్, లయన్ బిల్లా సులోచన, లయన్ తాడూరి రేణుక, లయన్ డి. వెంకటసుబ్బయ్య, లయన్ డాక్టర్ ఎస్. నాగవాణి, లయన్ డాక్టర్ జైన రమేష్ తదితరులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. హోస్ట్ క్లబ్ అధ్యక్షులు లయన్ వైద్యం రాజగోపాల్, కార్యదర్శి లయన్ గంజి నరహరి, కోశాధికారి లయన్ మార్త పాపయ్య తదితరులు ఈ కార్యక్రమ విజయవంతంలో కీలక పాత్ర పోషించారు. సత్కారం అందుకున్న వైద్యుల్లో డా.కె.సుధాకర్ రెడ్డి, డాక్టర్.నాగార్జున రెడ్డి, డా.లవకుమార్ రెడ్డి, డా.బైరి.లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.




# ఫారెస్ట్ అధికారి ఇంట్లో బిఆర్ఎస్ నేత దొంగతనం?

**మన దునియా,కరీంనగర్ జిల్లా:జులై 29**



అటవీ శాఖ అధికారి ఇంటిలోని బెడ్ రూమ్ లోనీ బీరువా లో దాచి ఉంచిన రూ"26 లక్షల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. కరీంనగర్ రూలర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసు కోగా.. ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది, బాధి తుడు అటవీశాఖ అధికారి కాగా. దొంగ తనానికి పాల్పడిన వ్యక్తి మాజీ జడ్పిటిసి, సభ్యురాలి భర్త కావడం గమనా ర్థం విశ్వాసనీయ సమాచార ప్రకారం.. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎక్లాస్ పూర్,కు చెందిన అటవీశాఖ అధికారి గుడిమల్ల శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా తీగల గుట్ట మణికేశ్వర నగర్ లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఇటీవల స్వగ్రామంలో ఉన్న వ్యవసాయ భూమిని 26 లక్షలకు విక్రయించారు. ఆ నగదును తన అద్దె ఇంటిలో దాచిపెట్టగా, ఈ మధ్యలో ఆ డబ్బు అవసరం పడలేదు, గత నెల చివరి వారం లో డబ్బు అవసరం ఉండడం తో ఓ రోజు ఆ గదికి వెల్లి చూడ గా తాళం ధ్వంసం చేసి ఉంది, తీసుకొ చ్చిన రూ 26 లక్షలు దొంగతనానికి గురయ్యాయి అని తెలుసుకొని ఇంతకు ముందు ల్యాప్ టాప్ దొంగతనం చేసిన వ్యక్తే తన ఇంట్లోనూ నగదును దొంగతనం చేశాడని బాధితుడు నిర్ధారణకు వచ్చాడు అదేవిధంగా గత నెలలో తన ఇంటికి వచ్చి వెళ్లిన తన స్నేహితుడు మంథని జడ్పిటిసి మాజీ సభ్యురాలు భర్త తగరం శంకర్ లాల్, దొంగతనం చేసినట్లు నిర్ధారించి పోలీసు లకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు శంకర్ లాల్ దొంగతనం చేసినట్లు నిర్ధారించి మంగళ వారం సాయంత్రం అదుపులోకి తీసు కున్నట్లు సమాచారం. మరి ఎవరిదైనా హస్తం ఉందా?అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# రాళ్లవాగును పరిశీలించిన రామగుండం పోలీస్ కమిషనర్!

**మన దునియా,మంచిర్యాల జిల్లా:జులై 29**



మంచిర్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ అప్రమత్తమైంది. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో ఉన్న రాళ్లవాగును బుధ వారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ, రాళ్లవాగు ఉద్ధృతంగా ప్రవహి స్తుండటంతో పాత మంచిర్యాల ప్రాంతా నికి రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. ప్రజల భద్రత కోసం ప్రమా దకర ప్రాంతాలను పూర్తిగా మూసివేసి, అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నా మని చెప్పారు. పోలీసులు సూచించిన ట్రాఫిక్ మళ్లింపులను ప్రజలు తప్పనిసరిగా పాటిం చాలని, వాగులు, వంకలు, ముంపు ప్రాంతాల వద్దకు వెళ్లకుండా అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేప థ్యంలో ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు.

# కాళేశ్వరం నుంచి జలాలు.. మానేరు డ్యామ్‌కు జలకళ ?

**నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మోటార్లు ప్రారంభం..**

**రైతుల్లో కొత్త ఆశలు**

**మన దునియా,కరీంనగర్ జిల్లా: జులై 29**



కాళేశ్వరం ప్రాజెక్టులోని నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మోటార్లు నేడు ప్రారంభం కావడంతో కరీంనగర్ జిల్లా రైతుల్లో ఆశలు చిగురించాయి. పంప్‌హౌస్‌ల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోస్తుండటంతో కరీం నగర్‌లోని లోయర్ మానేరు డ్యామ్ కు జలకళ సంతరించుకుంది.ఇటీవల కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యామ్‌ను సందర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టులోని పంప్‌హౌస్‌ల మోటార్లను వెంటనే ప్రారంభించి మానేరు డ్యామ్‌ను నీటితో నింపాలని ప్రభుత్వానికి సూచించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మోటార్లు ప్రారంభం కావడంతో గోదావరి జలాలు మానేరు డ్యామ్ వైపు తరలుతున్నాయి. దీంతో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో సాగునీటి అవసరాలకు భరోసా కలగడంతో పాటు ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆశలు పెరిగాయి.మానేరు డ్యామ్‌కు నీరు చేరుతుండటంతో కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో జలకళ కనిపిస్తోంది. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ పరిణామం ఊరటనిచ్చింది. కాళేశ్వరం జలాలను సమర్థవంతంగా వినియోగించి మానేరు డ్యామ్‌ను పూర్తి స్థాయిలో నింపి రైతులకు సాగునీటి కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటి తరలింపును కొనసాగించాలని, మానేరు డ్యామ్‌ను నింపి ఖరీఫ్ సాగుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# హైడ్రా మీద మరో ఇద్దరు సీనియర్ జడ్జిల ఆగ్రహం

- ప్రైవేట్ స్థలాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా ఏర్పాటుచేసిన బోర్డును 24 గంటల్లో తొలగించాలని ఆదేశించిన హైకోర్టు
- భూమి ఓనర్లకు నోటీసులివ్వకుండా మీ ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తారా అంటూ ఆగ్రహం

**మన దునియా,హైదరాబాద్: జులై 29**



హయత్‌నగర్ మండలం సాహెబ్ నగర్ కాలనీలోని ప్లాట్ నం.10లో హైడ్రా ఏర్పాటుచేసిన బోర్డును సవాల్ చేస్తూ ఝాన్సీ, మరో వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బీ విజయ్ సేన్ రెడ్డి ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సూచిస్తూ తదుపరి విచారణను ఆగస్టు 11కు వాయిదా మరో కేసులో నోటీసు ఇవ్వకుండా, వివరణకు అవకాశం కల్పించకుండా కూల్చివేతలకు దిగడంపై హైడ్రాతో పాటు తహసీల్దార్ వ్యవహారాన్ని తప్పుబట్టిన జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ కొండాపూర్‌లోని 350 చదరపు గజాల ప్లాటుకు చెందిన కాంపౌండ్ గోడ, వాచ్మన్ గదిని హైడ్రా కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ పెమ్మసాని సుధారాణి దాఖలు చేసిన పిటిషన్ పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ విచారణ కొండాపూర్‌లోని సర్వే నంబర్ 60లో ప్రైవేట్ స్థలంలోని కాంపౌండ్ గోడను కూల్చివేయాలంటూ హైడ్రాకు ఏ ఆధారాలతో లేఖ రాశారని శేరిలింగంపల్లి తహసీల్దార్‌ను నిలదీసిన హైకోర్టు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు ఎలా చేపట్టారని హైడ్రాను ప్రశ్నించి.. అలాగే ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రాకు సమాచారం ఎందుకు ఇచ్చారో ఈ నెల 30న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశిస్తూ విచారణను వాయిదా

# ప్రియుడితో ఫోన్‌లో ముచ్చట్లు.. ఏడుస్తున్న మూడేళ్ల కుమారుడి గొంతు నులిమి హత్య!

**మన దునియా,మథుర,ఉత్తర్‌ప్రదేశ్: జులై 29**




మథుర (ఉత్తర్‌ప్రదేశ్): కుటుంబ విలువలు, మానవత్వం, తల్లిదండ్రుల బాధ్యతలపై తీవ్ర ఆందోళన కలిగించే ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథుర జిల్లాలో వెలుగుచూసింది. రుచి జిందాల్ (32) అనే వివాహిత మహిళ తన ప్రియుడితో ఫోన్‌లో మాట్లాడుతున్న సమయం లో, ఏడుస్తూ తనను ఇబ్బంది పెడుతున్న మూడేళ్ల కుమారుడిని గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం, ఘటన అనంతరం చిన్నారి మరణాన్ని సహజ ఘటనగా చూపించే ప్రయత్నం జరిగినప్పటికీ, దర్యాప్తులో అనుమానాస్పద అంశాలు బయటపడటంతో విచారణను ముమ్మరం చేశారు. అనంతరం విచారణలో మహిళ తన నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది.ఇటీవలి కాలంలో వివాహేతర సంబంధాల నేపథ్యంలో కుటుంబ కలహాలు, హత్యలు, ఆత్మహత్యలు వంటి ఘటనలు పెరుగుతున్నాయి. భార్యాభర్తల మధ్య పరస్పర విశ్వాసం దెబ్బతినడం, కుటుంబ బంధాల కంటే వ్యక్తిగత కోరికలకు ప్రాధాన్యం ఇవ్వడం, చిన్నపిల్లల భవిష్యత్తును కూడా ప్రమాదంలోకి నెడుతోంది. ఈ ఘటన కూడా అలాంటి పరిణామాలకు మరో విషాద ఉదాహరణగా నిలిచింది.

మానవ విలువలు ఎటు పోతున్నాయి?

తల్లి అంటే ప్రేమ, మమకారం, త్యాగానికి ప్రతిరూపంగా భావించే సమాజంలో, కన్నబిడ్డ ప్రాణాన్ని తల్లి చేతుల మీదుగానే కోల్పోవడం అత్యంత విషాదకరం. వివాహేతర సంబంధాలు, క్షణిక భావోద్వేగాలు, కుటుంబ బాధ్యతలను విస్మరించడం చివరికి అమాయక పిల్లల జీవితాలను బలితీసుకునే పరిస్థితులకు దారితీయకూడదు.సమాజంలో కుటుంబ బంధాలను కాపాడుకోవడం, సమస్యలను చట్టబద్ధంగా మరియు పరస్పర సంభాషణ ద్వారా పరిష్కరించుకోవడం, పిల్లల భద్రతను అత్యున్నత బాధ్యతగా భావించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం, మానవీయ విలువలను పెంపొందించడం సమాజం ముందున్న ముఖ్యమైన బాధ్యత.

# ఘనంగా గురువులకు సన్మానం

**మన దునియా, జులై 29,మంచిర్యాల జిల్లా**

గురు పౌర్ణమి సందర్భంగా మందమర్రి సింగరేణి యోగ హాల్ లోపల వేద వ్యాసులకి, పతంజలి మహర్షి ,సూర్య భగవానునికి ,పూలమాలలు సమర్పించి అనంతా ఆచారి పూజా కార్యక్రమాలు నిర్వహించారు .ప్రారంభం నుంచి యోగా నేర్పిన గురువులు నగేష్ కి ,శంకర్ మాస్టర్ ,బర్ల సదానందం ,కొంపల్లి రమేష్, స్థానికంగా ఇతర గురువులం దరికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురు పౌర్ణమి విశేషం, యోగ గురువుల సందేశాలు గురువుల ప్రాముఖ్యత యోగ అర్థం చిత్తవృత్తులు నివారణ పంచకేశాలు తొలగించుకోవడం ఎలా, పంచ కోశాలు ఇలా మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి .అష్టాంగ యోగ ద్వారా ఎలా వ్యాధుల నుంచి బయటపడవచ్చు అనేది. అంతేకాకుండా మోక్షాన్ని పొందే అష్టాంగ మార్గం గురించి కొంత తెలియజేయడం జరిగింది. తర్వాత యోగ నేర్చుకున్న సాధకుల ఆరోగ్య పరిస్థితి మెరుగుదల గురించి కొంతమంది అనుభవాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యోగా గురువులు శానవాజ్సార్, ఆయుష్ టీచర్లు శైలజ ,రామ్మోహన్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ సూర్య నమస్కారాల మద్ది శంకర్ ,గవర్నర్ అవార్డు గ్రహీత వెంకటేష్, సీనియర్ యోగ సభ్యులు గంప అనిల్ దంపతులు శ్రీనివాస్, మచ్చయ్య మహిళా యోగ సభ్యులు సీనియర్ సిటిజన్ యోగ సాధకులు 50 మంది వరకు పాల్గొన్నారు. ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.



# వాయుగుండం ప్రభావం.. పలు జిల్లాల్లో వర్షాలు

**మూడ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం**

**మన దునియా,హైదరాబాద్ జులై 29**




బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తర ఒడిశా, గంగానది పశ్చిమ బెంగాల్ ప్రాంతాలపై కేంద్రీకృతమై పశ్చిమ వాయవ్య దిశగా కదులుతున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.దీని ప్రభావంతో మూడ్రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొంది. అటు నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్న నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల్లో మెదక్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసినట్టు చెప్పారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా 9.64 సెం.మీ, మెదక్ జిల్లా చేగుంటలో 8.11 సెం.మీ, మెదక్‌లో 7.68 సెం.మీ, శంకరంపేటలో 6.71 సెం.మీ, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా పాలెంలలో 6.90 సెం.మీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 6.14 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు వివరించారు. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని, గురు, శుక్రవారాల్లోనూ బలమైన గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఎల్ నినో కారణంగా జూన్, జూలైలో -49 సెం.మీ లోటు వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడించాయి.

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భారీ వర్షాలు**


నిజామాబాద్ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాత్రి నుంచి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకల్లోకి వరద పెరుగుతోంది. సిరికొండ మండలంలో కప్పల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. బ్రిడ్జి వద్ద వరద ప్రవాహానికి అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. భారీ వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. గత 24 గంటల్లో ప్రాజెక్టులోకి 6585 క్యూసెక్కుల వరద నీరు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు, 17.802 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 1395.40 అడుగులు, 7.139 టీఎంసీలుగా నమోదైంది. గత ఏడాది ఇదే రోజు ప్రాజెక్టులో నీటిమట్టం 1391.25 అడుగులు, 4.597 టీఎంసీలుగా ఉన్న విషయం తెలిసిందే. అటు మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు కూడా వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రాజెక్ట్ ఇన్ ఫ్లోలో 27,000 క్యూసెక్కులు, ఔవుట్ ఫ్లోలో 28,000 క్యూసెక్కులుగా ఉంది. అలాగే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 318.516 విటర్లకు గాను ప్రస్తుత నీటి మట్టం 317.240 విటర్లకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి సామర్థ్యం 7.17 టీఎంసీలుగా నమోదైంది. వరద ప్రవాహం నేపథ్యంలో ఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో పది యనిట్లలో 395 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

# చీకుపల్లి వాగు బ్రిడ్జి దగ్గర డ్రైవర్ సన్ రోడ్డు తెగిపోవడంతో అక్కడ పరిస్థితిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్





**మన దునియా, వాజేడు ,జులై 29**



ములుగు జిల్లాలో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టరు బోర్థడె హేమంత్ సహదేవరావు తెలిపారు బుధవారం వాజేడు మండలం చీకుపల్లి ఇసుక వాగు డ్రైవర్స్ న్ రోడ్డు పరిస్థితిని పరిశీలించి ప్రత్యామ్నాయ రహదారి పునరుద్ధరణకు తక్షణ చర్యలు సేపట్టాలని సంబంధించిన అధికారులకు ఆదేశించారు ప్రజలకు డ్రైవర్స్ న్ రోడ్డు వలన ఇబ్బందులు కలగక్కుంటా చూడాలని అధికారులను సంబంధించిన కాంట్రాక్టర్లకు సూచించారు అలాగే మూడు రోజులు వర్షాలు పడటం వలన చెరువులు కుంటలు వాగులు నిండుగ ప్రవహించటంవలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తప్పని పరిస్థితుల్లో మాత్రమే ప్రయాణాన్ని నిర్ణయించుకోవాలని సూచించారు ప్రమాదాలు జరగకుండా పోలీస్ రెవిన్యూ పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో నిరంతర పర్యవేక్షణలో కొనసాగించాలని సూచించారు ప్రస్తుత వరద ఉధృతి అధికంగా ఉండటంతో డ్రైవర్స్ అండ్ రోడ్డును ఇరువైపులా కాలువలు తవ్వి నీటిని మళ్లీ ఇస్తున్నట్టు తెలిపారు వరద ప్రభావం తగ్గిన వెంటనే రోడ్డును తిరిగి ఉపయోగం లోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడుతామని వెల్లడించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రావ్నథ్ కేకన్, ఐ టి డి ఏ పి ఓ, లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూర్ నాగారం ఎ ఎస్పి మనన్ బట్, తహసిల్దార్ శ్రీనివాస్ ఎంపీడీవో కొండ కృపాకర్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఆటో కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడాలి

**మన దునియా, జులై 29,మంచిర్యాల జిల్లా**

మందమర్రి ఆటో యూనియన్ పట్టణ అధ్యక్ష పదవికాలపరిమితి ముగిసినదని నేరెళ్ల వెంకటేష్ 11 మంది కమిటీ చైర్మన్ సభ్యులు బుధవారం మందమర్రి పట్టణ 11 మెన్ కమిటీ సమావేశం చైర్మన్ నేరెళ్ల వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగినది ఈ సమావేశానికి పొట్ట మధుకర్ జిల్లా అధ్యక్షులు హాజరైనారు లెవెన్ మెన్ కమిటీ సభ్యులు చైర్మన్ తో చర్చించి ఇప్పుడు ఉన్నటువంటి ఆటో యూనియన్ మందమర్రి పట్టణ కమిటీ కాలపరిమితి ముగిసిందని హాజరైన 11 మెన్ కమిటీ సభ్యుల ఏక తీర్మానంతో ప్రకటించినారు. ఈ రోజు నుండి మళ్లీ ఆటో యూనియన్ మందమర్రి ఎన్నికలు నిర్వహించే వరకు ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసమై పూర్తి బాధ్యత 11 మెన్ కమిటీ సభ్యులు ఆపధర్మ అధ్యక్షులు మొయ్య రాంబాబు ది ఉంటుందని తెలియజేశారు. మళ్ళీ ఎన్నికలు నిర్వహించే పూర్తి భాధ్యత లెవెన్ మెన్ కమిటీ దే ఉట్టుందని తెలియజేశారు.బేసజాలకు పోకుండా ఆటో కార్మికుల ఐక్యత కోసం హక్కుల సాధన కోసం విభేదాలు లేకుండా నాయకులందరూ కలిసి పని చేయాలని అందరం ఐక్యంగా ఉంటే ఎంత పెద్ద సమస్య అయినా పరిష్కరించవచ్చని అన్నారు ఈ కార్యక్రమంలో మందమర్రి ఆటో యూనియన్ అడక్ లెవెన్ మెన్ కమిటీ సభ్యులు సముద్రాల శ్రీనివాస్,రెడ్డి సతీష్,సూరం శ్రీనివాస్,బుక్కల సంతోష్ పంబాల శ్రీనివాస్,మాదాసు లింగమూర్తి,చొప్పరి లచ్చన్న,బొల్లం రమేష్,బొట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# పులులను కాపాడిన భారత్.. ప్రకృతికి చూపిన దారి

**మన దునియా,న్యూఢిల్లీ:జులై 29**

ప్రపంచం అంతా అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ, పులుల సంరక్షణలో భారత్ సాధించిన విజయం ప్రపంచానికి ఆశాకిరణంగా నిలుస్తోంది.బిజీవవైవిధ్యం వేగంగా తగ్గిపోతున్న ఈ కాలంలో, సరైన ప్రణాళిక, ప్రభుత్వ సంకల్పం, శాస్త్రీయ విధానం, ప్రజల భాగస్వామ్యం ఉంటే అంతరించిపోతున్న జంతువులను కూడా తిరిగి పెంచవచ్చని భారత్ నిరూపించింది. పులుల సంఖ్య పెరగడం కేవలం వన్యప్రాణి సంరక్షణలో విజయమే కాదు.ప్రకృతిని కాపాడటం అంటే భవిష్యత్ తరాలను కాపాడటమేనని ప్రపంచానికి చెప్పిన బలమైన సందేశం. 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన ప్రపంచ పులుల సదస్సు నాటికి ప్రపంచవ్యాప్తంగా కేవలం 3,200 అడవి పులులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అప్పట్లో పులులు ఉన్న 13 దేశాలు కలిసి 2022 నాటికి వాటి సంఖ్యను రెట్టింపు చేయాలని 'టీఎక్స్-2' లక్ష్యాన్ని ప్రకటించాయి.ఇప్పుడు ప్రపంచంలోని అడవి పులుల సంఖ్య సుమారు 5,700కు చేరుకుంది. ఇందులో భారత్ పాత్ర అత్యంత కీలకం. 2022లో విడుదలైన దేశవ్యాప్త పులుల లెక్కల ప్రకారం భారత్‌లో 3,682 పులులు ఉన్నాయి. అంటే ప్రపంచంలోని ప్రతి 10 అడవి పులుల్లో దాదాపు 7 పులులు భారత అడవుల్లోనే సంచరిస్తున్నాయి. ప్రపంచ భూభాగంలో కేవలం 2.5 శాతం మాత్రమే ఉన్న దేశం ఈ ఘనత సాధించడం ప్రకృతి సంరక్షణ చరిత్రలో అరుదైన విజయంగా నిలిచింది.

ప్రాజెక్ట్ టైగర్

2006లో దేశంలో 1,411 పులులు మాత్రమే ఉండగా, 2022 నాటికి ఆ సంఖ్య 3,682కు చేరుకుంది. ఈ లెక్కల కోసం అటవీ సిబ్బంది దేశవ్యాప్తంగా 6.41 లక్షల కిలోమీటర్లకు పైగా అడవుల్లో కాలినడకన తిరిగి ఆధారాలు సేకరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద జీవవైవిధ్య సర్వేలలో ఒకటైన ఈ ప్రక్రియ భారత్ సంరక్షణ వ్యవస్థకు నిదర్శనం. ఎన్నో సంవత్సరాలుగా ఎలాంటి విరామం లేకుండా కొనసాగుతున్న శాస్త్రీయ సంరక్షణ చర్యల ఫలితమే ఈ విజయం. పులులను కాపాడటం అంటే మొత్తం ప్రకృతి వ్యవస్థను కాపాడినట్టే. అడవులు నదులకు జీవం పోస్తాయి. భూసారాన్ని కాపాడతాయి. వర్షాలను సమతుల్యం చేస్తాయి.ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను తగ్గిస్తాయి. లక్షలాది మందికి తాగునీరు, సాగునీరు, జీవనోపాధికి ఆధారం అవుతాయి. అందువల్ల పులుల సంరక్షణ అనేది పర్యావరణానికి మాత్రమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకూ, ప్రజల భవిష్యత్తుకూ సంబంధించిన అంశం. ఈ విజయానికి బలమైన పునాది 1973లో ప్రారంభమైన 'ప్రాజెక్ట్ టైగర్'. తొమ్మిది రిజర్వులతో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు 18 రాష్ట్రాల్లో విస్తరించిన 58 పులుల అభయారణ్యాలకు చేరుకుంది.ఇవి మొత్తం సుమారు 84,500 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ఇది దేశ భౌగోళిక విస్తీర్ణంలో దాదాపు 2.56 శాతం. అడవుల పునరుద్ధరణ, అక్రమ వేట నియంత్రణ, అటవీ సిబ్బందికి ఆధునిక సదుపాయాలు, నిరంతర పర్యవేక్షణ, శాస్త్రీయ నిర్వహణ వంటి చర్యలను ప్రభుత్వం దశాబ్దాలుగా కొనసాగిస్తూ వచ్చింది. ఇదే విజయానికి ప్రధాన కారణం.

వైల్డ్‌లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో కీలక పాత్ర

ఈ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసేందుకు 2006లో జాతీయ




పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (ఎన్‌టీసీఏ) ఏర్పాటైంది. దేశవ్యాప్తంగా పులుల సంరక్షణ ప్రణాళికలను రూపొందించడం, అభయారణ్యాల నిర్వహణను పర్యవేక్షించడం, రాష్ట్రాలకు సాంకేతిక, ఆర్థిక సహాయం అందించడం వంటి బాధ్యతలను ఈ సంస్థ నిర్వహిస్తోంది.అలాగే అక్రమ వేట, వన్యప్రాణుల అక్రమ రవాణాను అరికట్టడంలో వైల్డ్‌లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం ఎం-స్ట్రైప్స్ అనే డిజిటల్ వ్యవస్థ ద్వారా జీపీఎస్ ఆధారంగా అటవీ సిబ్బంది పులుల కదలికలను నమోదు చేస్తున్నారు. అడవుల్లో ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్ ద్వారా సేకరించిన చిత్రాలను కృత్రిమ మేధతో విశ్లేషించి, ప్రతి పులిని దాని చారల ఆధారంగా గుర్తించే సాంకేతికతను వినియోగిస్తున్నారు.ప్రపంచంలోనే అతిపెద్ద కెమెరా ఆధారిత వన్యప్రాణుల సర్వే నిర్వహించి గిన్నిస్ ప్రపంచ రికార్డును కూడా భారత్ సొంతం చేసుకుంది. ప్రతి నాలుగేళ్లకోసారి జరిగే 'ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్' ప్రపంచంలోనే అతిపెద్ద జీవవైవిధ్య సర్వేగా గుర్తింపు పొందింది. 2022లో తొలిసారిగా పులుల ఆహారంగా ఉండే జింకలు, అడవి దున్నలు వంటి శాకాహార జంతువుల జాతీయ సర్వే కూడా నిర్వహించడం విశేషం.

గ్లోబల్ టైగర్ ఫోరం

ఢిల్లీలో ప్రధాన కార్యాలయం ఉన్న గ్లోబల్ టైగర్ ఫోరం ద్వారా 13 పులుల దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేస్తోంది. నేపాల్, భూటాన్, రష్యా, మయన్మార్ తదితర దేశాలతో కలిసి సరిహద్దు ప్రాంతాల్లో పులుల సంరక్షణ, అక్రమ వేట నిరోధానికి చర్యలు చేపడుతోంది. 2024లో భారతదేశంలోనే ప్రధాన కార్యాలయంతో ఏర్పడిన ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ ద్వారా పులులతోపాటు సింహం, చిరుత, మంచు చిరుత, చీతా వంటి ఏడు పెద్ద పిల్లి జాతుల సంరక్షణకు ప్రపంచ దేశాలను ఒక వేదికపైకి తీసుకొస్తోంది. దీంతో ప్రకృతి సంరక్షణ రంగంలో భారత్ ప్రపంచ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది.పులులు ఒక అడవి నుంచి మరో అడవికి సురక్షితంగా సంచరించేందుకు అవసరమైన వన్యప్రాణుల కారిడార్లను కాపాడటం ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ఈ సహజ మార్గాలు దెబ్బతింటే పులుల దీర్ఘకాలిక మనుగడకే ముప్పు ఏర్పడుతుంది. పులులను కాపాడటం అంటే ఒక జంతువును మాత్రమే రక్షించడం కాదు. అడవులను, నదులను, జీవవైవిధ్యాన్ని, చివరికి మన భవిష్యత్తునే కాపాడటం. అందుకే పులులను కాపాడిన భారత్, ప్రకృతిని కాపాడే మార్గాన్ని ప్రపంచానికి చూపించిన దేశంగా నిలిచింది.

# రైతులకు బిగ్ అలర్ట్.. పీఎం కిసాన్ 24వ విడత ఎప్పుడు వస్తుందో తెలుసా..?

**మన దునియా,న్యూఢిల్లీ:జులై 29**




భారత ప్రభుత్వం రైతుల కోసం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజనను నడుపుతోంది. దీని కింద రైతులకు సంవత్సరానికి మూడుసార్లు రూ.2,000 ఆర్థిక సహాయం అందిస్తారు.బిఈ పథకం కింద ఇప్పటివరకు మొత్తం 23 విడతలు విడుదలయ్యాయి. రైతులు ఇప్పుడు 24వ విడత కోసం ఎదురుచూస్తున్నారు. గత రికార్డుల ఆధారంగా తదుపరి విడత త్వరలోనే విడుదల కావచ్చు. అయితే 24వ విడతకు సంబంధించి ప్రభుత్వం ఇంకా అధికారిక తేదీని ప్రకటించలేదు. ప్రభుత్వం 24వ విడతను ఎప్పుడు విడుదల చేయవచ్చో తెలుసుకుందాం.

24వ విడత ఎప్పుడు వస్తుంది?

ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద ప్రభుత్వం ప్రతి సంవత్సరం రైతులకు రూ.6,000 ఆర్థిక సహాయం అందిస్తుంది. ఈ డబ్బును రూ.2,000 చొప్పున మూడు సమాన వాయిదాలలో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తారు. సాధారణంగా ప్రతి నాలుగు నెలలకు ఒకసారి వాయిదాలు జమ అవుతాయి. 23వ వాయిదా జూన్‌లో అందింది. అందుకే నిబంధనల ప్రకారం, 24వ వాయిదా 2026 అక్టోబర్‌లో అందాల్సి ఉంది. ప్రభుత్వం ఇంకా అధికారిక తేదీని ప్రకటించనప్పటికీ, నవరాత్రి లేదా దసరా పండుగల సమయంలో రూ.2,000 వాయిదా అందవచ్చని భావిస్తున్నారు.

వాయిదా రాకముందే ఈ మూడు పనులు చేయండి :

చాలా మంది రైతులు అకౌంట్లో డబ్బులు పడలేదని, లేదా డబ్బులు జమ అయిన తర్వాత కూడా విత్‌డ్రా చేసుకోలేకపోతున్నామని తరచూ ఫిర్యాదు చేస్తుంటారు. మీ ఖాతా ఇ-కేవైసిని సకాలంలో పూర్తి చేయకపోవడం, మీ ఆధార్, బ్యాంకు ఖాతాను అనుసంధానం చేయకపోవడమే దీనికి ప్రధాన కారణం కావచ్చు. మీరు ఇంకా మీ ఖాతా ఇ-కేవైసిని పూర్తి చేయకపోతే, మీ 24వ వాయిదా పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంది. మీరు మీ మొబైల్ ఫోన్‌ను ఉపయోగించి లేదా మీకు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్‌ను సందర్శించడం ద్వారా దీన్ని సులభంగా చేయవచ్చు. అంతేకాకుండా, మీ భూమి రికార్డులు ప్రభుత్వ పోర్టల్‌లో ధృవీకరించి ఉండాలి. అన్నింటికన్నా ముఖ్యంగా, మీ బ్యాంకు ఖాతా మీ ఆధార్ కార్డుకు అనుసంధానించి ఉండాలి. డిబిటి (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ఎనేబుల్ చేయబడి ఉండాలి. అప్పుడే మీ అకౌంట్లో తదుపరి వాయిదా జమ అవుతుందని గుర్తించుకోండి.

# రివేంజ్ అంటే ఇది..! అడ్మిషన్ ఇవ్వలేదని ఐ ఐ టి కాన్పూర్ వెబ్ సైట్ హ్యాక్ చేసిన స్టూడెంట్...

**మన దునియా,కాన్పూర్:జులై 29**

ప్రతి విద్యార్థికి ఒక డ్రీమ్ కాలేజ్, డ్రీమ్ కోర్సు ఉంటుంది. ఆ కాలేజీలో చదువుకోవాలని.. ఆ కోర్స్ చేయాలని కలలు కంటారు. కొందరికి అది కుదురుతుంది. మరికొందరికి వివిధ కారణాల వల్ల వీలు కాదు. నచ్చిన కాలేజీలో అడ్మిషన్ దొరకకపోతే తప్పని పరిస్థితుల్లో మరో కాలేజీలో జాయిన్ అవుతుంటారు. కానీ ఓ విద్యార్థి మాత్రం ఇలా చేయలేదు. తనకు అడ్మిషన్ తిరస్కరించిన కాలేజీ వెబ్ సైట్ హ్యాక్ చేశాడు. ఏ హ్యాకింగ్ కోర్సులో అయితే జాయిన్ అవ్వడానికి తనను రిజెక్ట్ చేశారో.. అదే కాలేజీ వెబ్ సైట్ హ్యాక్ చేసి తన హ్యాకింగ్ స్కిల్స్ ప్రదర్శించాడు. మొత్తానికి సదరు స్టూడెంట్ టాలెంట్ గుర్తించిన కాలేజ్ అతడికి అడ్మిషన్ కోసం అప్లికేషన్ పెట్టుకునేందుకు మరో అవకాశం ఉంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.దేశంలో ప్రముఖ ఐఐటీల్లో ఒకటైన ఐఐటీ కాన్పూర్?లో సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు అడ్మిషన్ కంటే ముందే హ్యాకథాన్‌లతో పాటు విద్యార్థుల సాంకేతిక సామర్థ్యాలను ప్రదర్శించడానికి వివిధ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో పాల్గొన్న ఓ విద్యార్థి ఫెయిల్ అయ్యాడు. ఎంపిక ప్రక్రియలో తన సామర్థ్యాలను నిరూపించుకోలేకపోవడంతో అడ్మిషన్ దొరకలేదు. దీంతో ఎలాగైనా ఐఐటీ కాన్పూర్?లో అడ్మిషన్ సంపాదించాలని సదరు యువకుడు భావించాడు. ఇందుకోసం వినూత్న ప్రయోగం చేశాడు. ఏకంగా ఐఐటీ కాన్పూర్ అఫిషియల్ వెబ్ సైట్ హ్యాక్ చేశాడు. తాను విఫలమైన హ్యాకింగ్? విభాగంలోనే తన సత్తా చూపెట్టాడు. వెబ్ సైట్ హ్యాక్ చేసి.. "సైట్ హ్యాక్ చేయబడింది. నాకు కావలసిందల్లా ఒక న్యాయమైన అవకాశం మాత్రమే" అనే సందేశాన్ని పంపాడు.ఆ తర్వాత ఎక్స్, రెడ్డిట్ వంటి సోషల్ మీడియా ప్లాట్ ఫామ్?లలో హ్యాకింగ్ సంబంధించిన ఫొటోలు షేర్ చేసి.. ఈ ఘటనకు తానే బాధ్యుడినని ప్రకటించాడు. ఐఐటీ కాన్పూర్ వెబ్ సైట్?ను హ్యాక్ చేయాలని ఉద్దేశం తనకు అస్సలు లేదని.. కేవలం తన సైబర్‌సెక్యూరిటీ నైపుణ్యాలను ప్రదర్శించడానికే ఇలా చేశానని పేర్కొన్నాడు. ఈ ఘటనపై మొదట పోలీసులకు ఫిర్యాదు చేయాలనుకున్న ఐఐటీ కాన్పూర్ ఆ తర్వాత నిర్ణయం మార్చుకుంది.ఓ విద్యార్థి జీవితం నాశనం చేయొద్దనే ఉద్దేశంతో పోలీసులకు కంప్లైంట్ చేయలేదు. అంతేకాకుండా హ్యాకింగ్?లో తన ప్రతిభ చూపెట్టిన విద్యార్థికి అడ్మిషన్ కోసం రెండోసారి అవకాశం కల్పించింది. అయితే, అవకాశాల కోసం ఇలాంటి చర్యలు కరెక్ట్ కాదని సదరు విద్యార్థికి స్వీట్ వార్నింగ్ ఇచ్చింది. ఒక యువ విద్యార్థి భవిష్యత్తును ప్రమాదంలో పడేయకుండా ఐఐటీ కాన్పూర్ తీసుకున్న నిర్ణయాన్ని చాలా మంది ప్రశంసిస్తున్నారు.




# రేషన్ కార్డు ఉన్నవారికి ఇదే లాస్ట్ ఛాన్స్.. మూడ్రోజులే టైమ్.. ఈ పని చేయకపోతే కార్డు కట్..

**మన దునియా,హైదరాబాద్: జులై 29**

తెలంగాణలో రేషన్ కార్డు ఉన్నవారికి బిగ్ అలర్ట్. రేషన్ కార్డు ఉన్నవారు ఈకేవైసీ పూర్తి చేయడానికి కేవలం మూడు రోజులు మాత్రమే సమయం మిగిలి ఉంది. రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుంది.లేకపోతే కార్డు ఇనాక్టివ్ అయిపోవడం వల్ల రేషన్ సరుకులు తీసుకోలేరు. ఇ-కేవైసీ(వ-ఖ్జ) ధృవీకరణను పూర్తి చేయడానికి ఈ నెల 31వ తేదీ వరకు రేవంత్ సర్కార్ గడువు ఇచ్చింది. అంటే కేవలం మూడు రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అప్పటిలోగా పూర్తి చేయకపోతే మీ కార్డు, నెలవారీ సరుకులను కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికీ చాలామంది కేవైసీ ప్రక్రియ పూర్తి చేయలేదు. దీంతో ప్రతీఒక్కరూ గడువులోకా పూర్తి చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియను సింపుల్‌గా ఎక్కడైనా పూర్తి చేయవచ్చు.

**జులై 31లోగా పూర్తి చేయాల్సిందే..**

కేవైసీ పూర్తి చేసేందుకు మీరు మీ సొంత ఊరికి తిరిగి వెళ్లాల్సిన అవసరం లేదు. బయోమెట్రిక్ లేదా ఐరిస్ స్కానింగ్ కోసం మీ ఒరిజినల్ ఆధార్ కార్డుతో సమీపంలోని ఏదైనా రేషన్ షాపుకు లేదా మీసేవా కేంద్రానికి వెళితే సరిపోతుంది. ఈ ప్రక్రియ కోసం ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఉచితంగా కంప్లీట్ చేసుకోవచ్చని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతీ లబ్దిదారుడు ఈ ప్రాసెస్ పూర్తి చేయాలి. 8 ఏళ్లపైబడిన ప్రతీఒక్కరూ తప్పనిసరిగా కేవైసీ పూర్తి చేయాలి. జులై 31లోగా పూర్తి చేయకపోతే రేషన్ సరుకులు నిలిచిపోతాయి. అలాగే తెలంగాణ ప్రభుత్వం త్వరలో పంపిణీ చేయనున్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డు కూడా అందదు.

**ఆగస్ట్ నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు**

ఆగస్ట్ నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం 1.05 కోట్ల కుటుంబాలకు వీటిని అందించనుంది. వీటిల్లో క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఇప్పటికే వీటి ప్రింటింగ్ పూర్తవ్వగా.. అన్ని జిల్లాలకు పంపించారు. ఆగస్ట్ 1 లేదా ఆగస్ట్ 15 నుంచి వీటిని పంపిణీ చేయనున్నారు. హైదరాబాద్‌లో ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ ప్రారంభించనుండగా.. తమ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు అందించనున్నారు. ఈ స్మార్ట్ కార్డులపై రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటో ఉంటుంది. జులై 31లోగా ఈకేవైసీ పూర్తి చేయనివారికి ఇవి అందవని స్పష్టం చేసింది. ఇంకా 5 లక్షల మంది రేషన్ లబ్దిదారులు ఈ ప్రక్రియ పూర్తి చేయలేదు. జులై 31కల్లా 100 శాతం ఈకేవైసీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ప్రభుత్వ యంత్రాగం ఆదేశాలు జారీ చేసింది. రేషన్ షాపులు, ప్రత్యేక శిబిరాల ద్వారా పూర్తి చేయాలని సూచించింది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## సామాన్యులకు మరో షాక్.. భారీగా పెరిగిన బియ్యం ధరలు.. ఎంతంటే..?

**మన దునియా,హైదరాబాద్: జులై 29**



తెలంగాణలో సామాన్యులకు షాకింగ్ న్యూస్. బియ్యం ధరలు పెరుగుతున్నాయి. ఎల్‌నివో ప్రభావంతో పంట దిగుబడి తగ్గిపోతుందనే ఆందోళనలు రేకెత్తుతున్నాయి. దీని వల్ల వ్యాపారులు బియ్యాన్ని నిల్వ చేసుకుంటున్నారు. ఈ కారణంతో ధరలు పెరుగుతున్నాయి. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా బియ్యం ధరలు పెరిగాయి. తెలంగాణలో బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దేశ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో ధరల పెరుగుదల మరింత ఎక్కువగా నమోదవుతోంది. ఈ పరిస్థితికి ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడులపై నెలకొన్న ఆందోళనలు ఒక కారణమైతే,.. ప్రైవేటు వ్యాపారులు భారీగా బియ్యాన్ని నిల్వ చేయడం మరో ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం.. మే నుంచి జులై మధ్య దేశవ్యాప్తంగా బియ్యం రిటైల్ ధరలు సగటున 3.33 శాతం పెరిగాయి. అదే కాలంలో తెలంగాణలో మాత్రం 4.65 శాతం పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం రాష్ట్రంలో బియ్యం సగటు రిటైల్ ధర కిలోకు రూ.52.67గా ఉండగా.. ఇది దేశ సగటుతో పోలిస్తే దాదాపు రూ.10 ఎక్కువ. ప్రముఖ రకాల సన్నబియ్యం ధరలు కిలోకు రూ.54 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు.. ఎల్‌నినో ప్రభావంతో పంటపై ఆందోళనలు నెలకొనడంతో ధరలు పెరిగాయని చెప్పారు. రానున్న నెలల్లో పంట బాగా వస్తే ధరలు మళ్లీ తగ్గే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు.అయితే ధరల పెరుగుదలకు ఎల్‌నినో ఒక్కటే కారణం కాదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం బాగానే ఉన్నందున సరఫరాలో పెద్ద అంతరాయం లేదన్నారు. అయినప్పటికీ ధరలు పెరగడానికి ప్రైవేటు వ్యాపారుల నిల్వలు కూడా ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పొందించిన పాలసీ పత్రం ప్రకారం.. భౌగోళిక-రాజకీయ అనిశ్చితులు, ఎరువులు-ఇంధన వ్యయాల పెరుగుదల, ఆసియా దేశాల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో బియ్యం ధరలు 30 నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది.పాలసీ పత్రంలో మూడు రకాల పరిస్థితులను ప్రస్తావించారు. పంట ఉత్పత్తి సాధారణంగా ఉండి, భారీ కొనుగోళ్లు జరగకపోతే ధరలు 10-20 శాతం వరకు మాత్రమే పెరగొచ్చని పేర్కొంది. అయితే ప్రస్తుతం ఎక్కువ అవకాశాలు ఉన్న పరిస్థితిలో.. మోస్తరు దిగుబడి తగ్గుదల, నిల్వల పెరుగుదల కారణంగా ధరలు 30-50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. ఒకవేళ ఎగుమతి ఆంక్షలు, భయంతో భారీ కొనుగోళ్లు జరిగితే ప్రపంచ బియ్యం ధరలు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రానున్న ఖరీఫ్ పంట ఆశించిన స్థాయిలో వస్తే బియ్యం ధరలు క్రమంగా తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. అయితే ఎల్‌నినో ప్రభావం కొనసాగడం, నిల్వలు పెరగడం వంటి అంశాలు కొనసాగితే వినియోగదారులపై ధరల భారం మరింత పెరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## పెద్దన్న కోసం బజ్జుతండ సర్పంచ్ జాటోత్ రవి చిన్న ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక పూజలు



**మన దునియా,గుండ్లపహాడ్/బజ్జుతండ:జులై 29**



గుండ్లపహాడ్/బజ్జుతండ గ్రామంలోని త్రికూట శ్రీ రాజరాజేశ్వర స్వామి శివాలయంలో నర్సంపేట అభివృద్ధి ప్రధాత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని,మళ్ళీ ప్రజా సేవలో అడుగుపెట్టాలని బజ్జుతండలోని పెద్దన్న అభిమానులు పార్టీలకతీతంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. శివాలయంలోని పూజారి రాజకోటయ్య శివునికి అభిషేకం,అర్చనలు నిర్వహించారు.అనంతరం పెద్దన్న అభిమానులు 101 కొబ్బరికాయలను కొట్టి, శివునికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాటోత్ పద్మ తిరుపతి,ఎంపీటీసీ అజ్మీరా లక్ష్మి సామ్య,గ్రామ పార్టీ అధ్యక్షులు తేజవత్ ద్రశు,ఉప సర్పంచ్ తేజవత్ రాజేందర్,వార్డ్ సభ్యులు ముంగాలి,వెంకట్రాం, రజితచందర్ గ్రామ ముఖ్యులు జాటోత్ కొమ్మాలు,మాజి సర్పంచ్ జీవులా,మాజి ఉప సర్పంచ్ జర్పుల లత,పెద్దమనిషి జరుపుల కొమ్మాలు,అజ్మీరా రూపులా,అజ్మీరా బాల్య,తేజవత్ భద్రు, లేవుద్యా రాంసింగ్,బానోత్ శివ,నునావత్ కభీర్,దేవరాజ్,రాములు, రాజ్య,సదయ్యా,తదితరులు పాల్గొన్నారు..

# అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్







**మీడియా సమావేశంలో ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి**

**కేశంపేట పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు..**

**7 తులాల బంగారు గొలుసులు, మూడు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం**

**మన దునియా,షాద్‌నగర్: కేశంపేట:జులై 29**

షాద్‌నగర్: కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. భవిష్యత్ సిటీ కమిషనరేట్ పరిధిలోని కేశంపేట, కడ్తాల్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన చైన్ స్నాచింగ్, ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి మీడియాకు తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ డిసిపి కర్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. స్థానిక డిసిపి శిరీష రాఘవేంద్ర, ఏసిపి లక్ష్మీనారాయణ, కేశంపేట సీఐ నరహరి తదితరులు మీడియా సమస్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూసుమారు 7 తులాల బంగారు గొలుసులు, మూడు మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన సుఖ్‌దేవ్ సింగ్ (38), షమ్షేర్ సింగ్ (36), మన్‌ప్రీత్ సింగ్ (24) హార్వెస్టర్ డ్రైవర్లు, కూలీలుగా పనిచేస్తూ తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలపై అవగాహన పెంచుకున్నారు. స్థానిక రహదారులు, గ్రామాలు, మార్గాలు, తప్పించుకునే దారులపై పరిచయం ఏర్పడటంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు చైన్ స్నాచింగ్, ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

**వృద్ధురాలి మెడలోని 4 తులాల బంగారు పుస్తెలతాడు అపహరణ**

జూలై 25న కేశంపేట మండలం సంతాపూర్ గ్రామ శివారులో ఓ వృద్ధురాలు తన మనవరాలితో కలిసి వెళ్తుండగా.. మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు దారి అడిగినట్లు నటించి, ఒక్కసారిగా ఆమె మెడలోని 4 తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారైనట్లు పోలీసులు తెలిపారు. అదే రోజు కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోనూ మరో మహిళను బెదిరించి, కింద పడేసి ఆమె మెడలోని 3 తులాల బంగారు పుస్తెలతాడును అపహరించినట్లు విచారణలో వెల్లడైంది.

**మరో కేసులో చోరీ చేసిన బైక్‌తోనే చైన్ స్నాచింగ్**

జూన్ నెలలో కొత్తకోట ప్రాంతంలో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి, అదే వాహనంతో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు నిందితులు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం చోరీ చేసిన బంగారు ఆభరణాలను విక్రయించి డబ్బును పంచుకున్నట్లు వెల్లడించారు. జూలై 23న నాందేడ్ నుంచి సికింద్రాబాద్‌కు రైలులో వచ్చిన నిందితులు, అక్కడి నుంచి మరోసారి నేరాలకు పాల్పడేందుకు సిద్ధమైనట్లు పోలీసులు పేర్కొన్నారు. జూలై 24న మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద పార్క్ చేసిన హోండా సీడీ-100 ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి, దానితో కేశంపేట, కడ్తాల్ ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు తెలిపారు.

**కేశంపేట ఎక్స్ రోడ్డులో అరెస్ట్**

మరో చైన్ స్నాచింగ్‌కు సిద్ధమవుతున్న సమయంలో విశ్వసనీయ సమాచారం మేరకు జూలై 29న కేశంపేట ఎక్స్ రోడ్డు వద్ద ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.విచారణలో కేశంపేట, కడ్తాల్, మహబూబ్‌నగర్ టౌన్, కొత్తకోట పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన పలు కేసులకు సంబంధించి నిందితులు తమ ప్రమేయాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. కేసు ఛేదనలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి పర్యవేక్షణలో, షాద్‌నగర్ డివిజన్ ఏసీపీ సిరిషా రాఘవేంద్ర, ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ, కేశంపేట సీఐ బి. నరహరి, ఎస్ఐ టీ. రాజ్‌కుమార్, కేశంపేట పోలీస్ సిబ్బంది, జోనల్ క్రైమ్ టీమ్ కీలకంగా పనిచేసినట్లు పోలీసుల ప్రకటనలో పేర్కొన్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలపై సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని, భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటును విస్తృతంగా చేపట్టాలని పోలీసులు సూచించారు..

# గోదావరి వాగులు వంకలు పొంగి పొర్లుతున్నవి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి పేరూరు ఎస్సై జి కృష్ణ ప్రసాద్





**మన దునియా, వాజేడు, జూలై 29**

భారీ వర్షాల కారణంగా పేరూరు చంద్రు పట్ల టేకులగూడెం కృష్ణాపురం కడేకల్ పరిధిలోని గోదావరి వాగులు వంకలు పొంగిపొర్లుతున్నవి ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేరూరు ఎస్సై జి కృష్ణ ప్రసాద్ సూచించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోని పొంగి ప్రవహిస్తున్న గోదావరి వాగులు కలవట్లు లోతట్టు ప్రాంతాలు దాటే ప్రయత్నం చేయవద్దని చేపల వేట కోసం గోదావరి వాగులు చెరువులు ఇతర జలాశయాలకు వెళ్ళరాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు ప్రాణాపాయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అనవసరంగా బయటికి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు పశువుల కాపరీలు పశువుల మేపుటకు అటవీ ప్రాంతానికి వెళ్ళినప్పుడు తగిన జాగ్రత్తలు వహించాలని అటవీ ప్రాంతంలో ఉండే వాగులు, లోతట్టు ప్రాంతాలు దాట రాదని కొండ చర్యలు విరిగిపడే అవకాశం ఉన్నందున వాటి సమీపంలో పశువులను మేప రాదని సూచించారు అత్యవసర పరిస్థితి ఏర్పడినట్లయితే వెంటనే పోలీస్ అత్యవసర సేవా డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు భారీ వర్షాల నేపథ్యంలో పేరు ఎస్సై జి కృష్ణ ప్రసాద్ మర్రి వాగును రేగు మాకు వాగును పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు ప్రజల ప్రాణ ఆస్తి రక్షణకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపడతామని తెలిపారు ప్రజలందరూ పోలీసు శాఖ సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండి సహకరించాలని తెలియజేశారు

## గురువులకు వందనం ఘనంగా గురుపూజోత్సవం

**మన దునియా, ,జూలై 29,మంచిర్యాల జిల్లా**



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మంచిర్యాల బీజేపీ ఎండోమెంట్ సెల్ జిల్లా కో-కన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం మందమర్రి మండలంలోని దుబ్బపల్లి శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం ఆవరణలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు ఊట్ల వెంకట శాస్త్రి, మిట్టపల్లి సత్యనారాయణ శాస్త్రి, అలాగే బీజేపీ సీనియర్ నాయకులు దీక్షితులు ను శాలువాలతో సత్కరించి గురువందనం చేశారు. గురువుల మార్గదర్శకత్వం సమాజానికి ఎంతో అవసరమని, వారి సేవలను స్మరించుకుంటూ గురుపూజోత్సవాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు గిర్నాటి జనార్ధన్, మాజీ ఉపసర్పంచ్ దరవేని రవికుమార్, మిట్టపల్లి ప్రదీప్, ఎలగందుల సత్యం, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల అన్‌ఫిట్ విషయంలో ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం మానవతా దృక్పథంతో ఆలోచించాలి

**2025--26 ఆర్థిక సంవత్సరం లాభాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

**కొత్తగా గుర్తించిన అన్ని బొగ్గు బ్లాక్‌లను ఎలాంటి షరతులు లేకుండా సింగరేణికే కేటాయించాలి**

**ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎచ్‌ఎంఎస్ నేత సిద్దంశెట్టి సాజన్**

**మన దునియా, జులై 29,మంచిర్యాల జిల్లా**



సింగరేణి కార్మికుల అన్‌ఫిట్ సమస్యతో పాటు కార్మికులకు లాభాల్లో వాటా, సింగరేణి సంస్థ భవిష్యత్తు, కొత్త బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు విషయంలో ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని మందమర్రి ఏరియా ఎచ్ ఎం ఎస్ వైస్ ప్రెసిడెంట్ సిద్దంశెట్టి సాజన్ డిమాండ్ చేశారు. బుధవారం మందమర్రిలో ఎచ్ ఎం ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కార్మికుల అన్‌ఫిట్ విషయంలో మానవతా దృక్పథం అవసరం ఎచ్ ఎం ఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన బాయిబాట కార్యక్రమంలో ఇచ్చిన నిరవధిక నిరాహార దీక్ష అల్టిమేటం కారణంగానే సింగరేణి యాజమాన్యం మెడికల్ బోర్డు నిర్వహించిందని సాజన్ అన్నారు. అయితే మెడికల్ బోర్డుకు హాజరైన కార్మికుల విషయంలో యాజమాన్యం మరింత మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.కాశీపేట-1 గనికి చెందిన వెంకటేశ్వర్లు అనే కార్మికుడు తన కాలును పూర్తిగా కోల్పోయినప్పటికీ ఆయనను ఫిట్‌గా ప్రకటించి, అండర్‌గ్రౌండ్ విధులకు బదులుగా సర్ఫేస్‌లో విధులు నిర్వహించాలని సూచించడం పట్ల సాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి తీవ్ర శారీరక వైకల్యం ఉన్న కార్మికుడి పరిస్థితిని మానవతా కోణంలో మరోసారి పరిశీలించాలని ఆయన కోరారు.సింగరేణిలో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని వాస్తవికంగా, నిష్పక్షపాతంగా పరిశీలించి న్యాయం చేయాలని అన్నారు. కేవలం నామమాత్రంగా మెడికల్ బోర్డు నిర్వహించి కార్మికులను తిరిగి విధుల్లోకి పంపడం వల్ల వారి ప్రాణాలకు, ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే పరిస్థితి ఉండకూడదన్నారు. కార్మికుల శారీరక సామర్థ్యం, వైద్య పరిస్థితి, వారు నిర్వహిస్తున్న పనుల స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్మికుల శ్రమతో పెరిగిన ఉత్పత్తి, డిస్పాచ్, ఉత్పాదకతకు తగిన లాభాల వాటా ఇవ్వాలి.సింగరేణి సంస్థ 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభనష్టాల పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని సాజన్ డిమాండ్ చేశారు.ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ సుమారు 58 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, 62 మిలియన్ టన్నుల బొగ్గును డిస్పాచ్ చేసిందని ఆయన తెలిపారు. అదే విధంగా గతంలో సింగరేణిలో కార్మికుల ఉత్పాదకత సుమారు 5.5 టన్నులు ఉంటే, ప్రస్తుతం అది 7.5 టన్నులకు పెరిగిందని అన్నారు.సింగరేణి ఉత్పత్తి, డిస్పాచ్ పెరగడంలోనే కాకుండా కార్మికుల ఉత్పాదకత గణనీయంగా పెరగడంలో కూడా సింగరేణి కార్మికుల చెమట చుక్కలు, కష్టానికి, అంకితభావానికి, నిరంతర శ్రమకు ప్రధాన పాత్ర ఉందని సాజన్ స్పష్టం చేశారు. కార్మికులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేస్తూ సంస్థ ఉత్పత్తి, డిస్పాచ్, ఉత్పాదకతను పెంచారని, వారి శ్రమ ఫలితంగానే సింగరేణి సంస్థకు భారీ ఆదాయాలు, లాభాలు సమకూరుతున్నాయని అన్నారు.2024--25 ఆర్థిక సంవత్సరంలో సుమారు 65 మిలియన్ టన్నుల డిస్పాచ్‌తో సింగరేణి సంస్థకు ?6,000 కోట్లకు పైగా లాభాలు వచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా ఉత్పత్తి, డిస్పాచ్, ఉత్పాదకతలో గణనీయమైన పనితీరు కనబరిచిన నేపథ్యంలో సంస్థకు వచ్చిన వాస్తవ లాభాల వివరాలను యాజమాన్యం కార్మికుల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.సింగరేణి సంస్థకు ఎంత లాభం వచ్చింది? ఆ లాభాల్లో ప్రభుత్వానికి ఎంత వాటా? సంస్థ అభివృద్ధికి ఎంత కేటాయించారు? కార్మికుల సంక్షేమానికి ఎంత ఖర్చు చేస్తున్నారు? అనే అంశాలపై యాజమాన్యం పూర్తి వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని సాజన్ కోరారు.గత ఆర్థిక సంవత్సరంలో లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు అందించిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ఈ ఏడాది కూడా కార్మికుల పెరిగిన ఉత్పాదకతను, వారి శ్రమను పరిగణనలోకి తీసుకుని గతం కంటే తక్కువ కాకుండా మరింత మెరుగైన లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్మికుల ఉత్పాదకత పెరిగినప్పుడు లాభాల్లో వారి వాటా కూడా పెరగాలి. కార్మికుల శ్రమతో వచ్చిన లాభాలను కార్మికులకు దక్కకుండా చేయడం ఏ మాత్రం న్యాయం కాదు. శాతం పేరుతో లాభాల వాటాను తగ్గించే ప్రయత్నం చేస్తే కార్మికులు, ఎచ్ ఎం ఎస్ చూస్తూ ఊరుకోదని సాజన్ తెలియజేశారు కొత్త బొగ్గు బ్లాక్‌లు సింగరేణికే కేటాయించాలిసింగరేణి సంస్థను రక్షించుకోవాలంటే తెలంగాణలో కొత్తగా గుర్తించిన అన్ని బొగ్గు బ్లాక్‌లను ఎలాంటి షరతులు లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని సాజన్ డిమాండ్ చేశారు. మణుగూరు పి కే ఓ సి -2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని కోరుతున్న సమయంలో వేలం నిర్వహించడం అన్యాయమని ఆయన అన్నారు. అంతేకాకుండా, ఈ వేలంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన జెన్‌కో సంస్థ పాల్గొనడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన సింగరేణి సంస్థకు పోటీగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని మరో సంస్థ వేలంలో పాల్గొనే పరిస్థితి రావడం సరైన విధానం కాదన్నారు. జెన్‌కో వేలంలో పాల్గొనకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు.జెన్‌కో వేలంలో పాల్గొనకుండా చూడాలని ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పడం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం జెన్‌కో పాల్గొనకుండా చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇద్దరూ చర్చించుకుని ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. తాడిచర్ల బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన విధంగానే మణుగూరు పి కే ఓ సి -2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కూడా ఎలాంటి షరతులు లేకుండా సింగరేణికే కేటాయించాలని సాజన్ డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ కేవలం ఒక బొగ్గు కంపెనీ కాదని, తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా, వేలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉందని ఆయన అన్నారు. సింగరేణి భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, యాజమాన్యంపై ఉందన్నారు. కార్మికుల హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, కార్మికుల ప్రయోజనాలు, సింగరేణి సంస్థ భవిష్యత్తు, తెలంగాణ ప్రజల హక్కులను కాపాడేందుకు ఎచ్ ఎం ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని సాజన్ స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో మందమర్రి ఏరియా ఎచ్ ఎం ఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సుదర్శన్, కేంద్ర కార్యదర్శి నాగనవేణి హరీష్, ఏరియా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నవీన్, జాయింట్ సెక్రటరీ నీరటి కార్తీక్, హర్షవర్ధన్, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌతం, శ్రావణ్, జబీర్, కోశాధికారి శ్రావణ్, కాశీపేట-1 ఫిట్ సెక్రటరీ ప్రీత్ పాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయం.

**వార్షిక తనిఖీల్లో భాగంగా మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ.**

**పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష -- ఆన్‌లైన్ నమోదుపై ప్రత్యేక దృష్టి**

**ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నిస్పాక్షికంగా సేవలు అందించాలి**

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్.**

**మన దునియా,మహాదేవ్‌పూర్: జూలై 29**

భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ వార్షిక తనిఖీల్లో భాగంగా మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటడం జరిగింది, అనంతరం పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ,



పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ,దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.అదేవిధంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ, కేసు రికార్డుల నవీకరణ విధానాన్ని పరిశీలించి, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ నిర్వహించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, వారిపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికి స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులు, సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ వార్షిక తనిఖీలలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవ్‌పూర్ సీఐ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఉప్పొంగుతున్న వాగులు.. ప్రమాదాలకు దూరంగా ఉండండి

**అత్యవసరం అయితేనే బయటకు రావాలి -- జన్నారం ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్**

**ఖానాపూర్ ఆర్సి మన దునియాజన్నారం, జూలై 29:**





జన్నారం మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు, ఒర్రెలు, కాలువలు, చెరువులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని జన్నారం ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ విజ్ఞప్తి చేశారు. వర్షాల తీవ్రత దృష్ట్యా మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలో పోలీసులు ప్రత్యేక గస్తీ నిర్వహిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.అత్యవసర పరిస్థితులు మినహా ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులు, నీటిమడుగులను దాటే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించారు. కొద్దిపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు.భారీ వర్షాలకు రహదారులపై చెట్లు కూలిపోవడం, బలమైన గాలులకు కొమ్మలు విరిగిపడటం, విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉన్నందున ప్రజలు అనవసర ప్రయాణాలను పూర్తిగా నివారించాలని సూచించారు. నీటిలో మునిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాల వద్దకు వెళ్లకుండా చిన్నారులు, విద్యార్థులు, రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఎక్కడైనా ప్రమాదాలు సంభవించినా లేదా వరదల్లో ఎవరైనా చిక్కుకున్నా వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు. పోలీసు శాఖతో పాటు రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్ తదితర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ నాయకత్వంలో జన్నారం పోలీసులు మండలవ్యాప్తంగా నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రజలంతా అధికారుల సూచనలను పాటించి, అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ప్రమాదాలను నివారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు విజ్ఞప్తి

**మన దునియా,ములుగు జిల్లా: జులై 29**



ములుగు సబ్ డివిజన్ పరిధిలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాము.భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు మరియు లోతట్టు ప్రాంతాలు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున, అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలి. ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, కాలువలు లేదా రహదారులపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించరాదు. తల్లిదండ్రులు తమ పిల్లలను వరద నీటి ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులు, పశువుల కాపరులు వర్షం మరియు పిడుగులు పడుతున్న సమయంలో చెట్ల కింద నిలబడకుండా సురక్షిత ప్రదేశాల్లో ఆశ్రయం పొందాలి.వాహనదారులు భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో, ముఖ్యంగా రాత్రి వేళల్లో, అత్యంత అప్రమత్తంగా ప్రయాణించాలి. రహదారుల పరిస్థితిని తెలుసుకున్న తర్వాత మాత్రమే ప్రయాణాలు చేపట్టాలి. ఎక్కడైనా రహదారులు దెబ్బతినడం, చెట్లు కూలిపోవడం, వరద నీరు చేరడం లేదా రహదారులపై నీరు ప్రవహించడం వంటి పరిస్థితులు ఎదురైతే, అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ వారికి పూర్తి సహకారం అందించాలి. ములుగు జిల్లా పోలీసు సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండి, లోతట్టు ప్రాంతాలు, వాగులు, ప్రధాన రహదారులు మరియు వరద ప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రజలందరూ పోలీసు శాఖ మరియు ఇతర ప్రభుత్వ శాఖలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను పాటిస్తూ తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతకు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

## వాగులు దాటొద్దు.. ప్రాణాలతో చెలగాటం వద్దు

**భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు సీఐ డి. రమణమూర్తి హెచ్చరిక**

**మన దునియా లక్షెట్టిపేట, జూలై 29:**




లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం పోలీస్ సర్కిల్ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. రమణమూర్తి పిలుపునిచ్చారు. వర్షాల ప్రభావంతో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు పొంగిపొర్లే అవకాశాలు ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అధికార యంత్రాంగం సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వరద నీటిలో ప్రయాణాలు చేయడం, సాహసాలకు పాల్పడడం ప్రమాదకరమని పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, నీటిలో మునిగిన విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలని సూచించిన సీఐ, వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపల వేట, ఈత, పశువుల మేపు వంటి కార్యకలాపాలకు వెళ్లవద్దని హెచ్చరించారు. చిన్నారులను వాగులు, చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే డయల్--100కు సమాచారం అందించాలని, పోలీసులు తక్షణమే స్పందించి అవసరమైన సహాయాన్ని అందిస్తారని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి పోలీసు శాఖకు సహకరించాలని సీఐ డి. రమణమూర్తి విజ్ఞప్తి చేశారు.

మన దునియా

RNI Number

మన అక్షరం – మన ప్రపంచం

## వరంగల్‌కు కమ్యూనిటీ రేడియో లేకపోవడంపై కేంద్రాన్ని ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

**మన దునియా,న్యూఢిల్లీ:జులై 29**



వరంగల్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రచార కార్యక్రమాల ద్వారా ఎంత మేర ప్రయోజనం చేకూరుతోంది? కమ్యూనిటీ రేడియో కేంద్రాలకు, ప్రజా అవగాహన కార్యక్రమాలకు ఎలాంటి సహాయం అందుతోంది? కేంద్ర సంక్షేమ పథకాల ప్రచారం కోసం వరంగల్‌లో చేపట్టిన చర్యలు ఏమిటి? అనే కీలక అంశాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో లేవనెత్తారు. గత మూడు సంవత్సరాల్లో వరంగల్ జిల్లాలో కమ్యూనిటీ రేడియో స్టేషన్లు, మీడియా అవుట్‌రీచ్ కార్యక్రమాలు, ప్రజా చైతన్య ప్రచారాలకు కేంద్రం అందించిన ఆర్థిక సహాయం, లబ్ధిదారుల వివరాలు, కేంద్ర పథకాల ప్రచారం కోసం చేపట్టిన కార్యక్రమాలపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖను ఎంపీ డా.కడియం కావ్య ప్రశ్నించారు. ఈ మేరకు వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ లిఖితపూర్వక సమాధానమిస్తూ ప్రస్తుతం వరంగల్ జిల్లాలో ఒక్క కమ్యూనిటీ రేడియో స్టేషన్ కూడా లేదని వెల్లడించారు. అయితే దేశవ్యాప్తంగా కమ్యూనిటీ రేడియో ఉద్యమాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ, వరంగల్‌లో మాత్రం ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. అలాగే గత మూడు సంవత్సరాల్లో వరంగల్, పరిసర ప్రాంతాల్లో 17 ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌లు నిర్వహించినట్లు కేంద్రం తెలిపింది. యోగా దినోత్సవం, స్వచ్ఛ భారత్ అభియాన్, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, ఓటరు అవగాహన కార్యక్రమాలు, నషా ముక్త్ భారత్, పోషణ్ మాహ్ తదితర అంశాలపై ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించింది. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ,"వరంగల్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల సమాచారం మరింత విస్తృతంగా చేరాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో కమ్యూనిటీ రేడియో వంటి ప్రజా సమాచార వేదికలు లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని తెలిపారు. వరంగల్‌కు రావాల్సిన అవకాశాలు, కేంద్ర మద్దతు, సంస్థలను సాధించేందుకు పార్లమెంట్‌లో నిరంతరం ప్రశ్నిస్తాన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. జిల్లాకు సంబంధించిన ప్రతి అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ప్రజా సమస్యల పరిష్కారం, వరంగల్‌కు తగిన ప్రాధాన్యం కల్పించడమే తన లక్ష్యమని ఎంపీ డా.కడియం కావ్య పేర్కొన్నాయి.

## భారీ వర్షాల నేపథ్యంలో బొగత జలపాతం తాత్కాలికంగా మూసివేత

**మన దునియా, వాజేడు, జులై 29**





ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలో బొగత జలపాతం నందు చత్తీస్గడ్ మహారాష్ట్ర లో కురిసిన భారీ వర్షాల వలన బొగత జలపాతానికి భారీగా వరద నీరు చేరడంతో తాత్కాలికంగా జలపాతాన్ని మూసివేసినట్లు వాజేడు రేంజ్ అటవీశాఖ అధికారులుతెలిపారు ప్రజలు పర్యాటకులు జలపాతం ప్రాంతానికి రావద్దని అటవీ శాఖ విజ్ఞప్తి చేసింది

## రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ గా నఅనుపమ సుబేదార్ ఎన్నిక

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి**





రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ 315 చైర్మన్ గా నిజామాబాద్ నగరానికి చెందిన అనుపమ సుబేదార్ ఎన్నిక అయ్యారు, ఇటీవల హైదరాబాద్ తాజ్ హోటల్ లో జరిగిన ఎన్నికల్లో మొత్తంగా35 తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర లకు సంబంధించిన ఇన్నర్ వీల్ క్లబ్ 22 క్లబ్ ల అధ్యక్షులు ఇతర 190 మంది కార్యవర్గ సభ్యులు ఈ ఎన్నికలో పాల్గొనగా , ప్రమాణ స్వీకార కార్యక్రమం హైదరాబాద్ క్లబ్ ప్రధినిధులు సృజన,స్వందన ఆధ్వర్యంలో నిర్వహించగా క్లబ్ పద్మ శర్మ కన్వీనర్ గా కో కన్వీనర్ గా రమా దేవి ,ఉమ రాణి క్లబ్ అధ్యక్షులు లక్ష్మీ మాధవి లత లు బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఇన్నర్ వీల్ క్లబ్ చైర్మన్ అనుపమ సుబేదార్ మాట్లాడుతూ నాపైన నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించడానికి మరింత బాధ్యతను పెంచిందని ప్రజల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ముఖ్యంగా మహిళ సాధికార సాధించడం, ఆడపిల్లల విద్య పై ప్రత్యేక దృష్టి సాధించి ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు అనుపమసుబేదారి నియామకం పట్ల నిజామాబాద్ ఇన్నర్ మిల్క్ క్లబ్ అధ్యక్షురాలు సులక్షణ కార్యదర్శి ప్రసన్న పిడిసి శైలజ , స్వరూప రెడ్డి సౌందర్య రోటరీ క్లబ్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు




# మరోసారి మంచి మనసును చాటుకున్న మెగాప్రిన్స్ వరుణ్ తేజ్

ప్రముఖ సినీ నటుడు వరుణ్ తేజ్ తన ఉదారతను మరోసారి చాటుకున్నారు. ట్యూమర్‌తో బాధపడుతున్న అనంతపురం జిల్లాకు చెందిన ఓ అభిమానికి అండగా నిలిచి, తన మానవత్వాన్ని ప్రదర్శించారు. బాధితుడిని హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ ఆసుపత్రిలో చేర్పించడమే కాకుండా, చికిత్సకు అయ్యే పూర్తి వ్యయాన్ని తానే స్వయంగా భరించి భరోసానిచ్చారు. అనంతపురం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు, గుత్తి పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్ పాటిల్ కొంతకాలంగా ట్యూమర్ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వరుణ్ తేజ్ తక్షణమే స్పందించారు. తన తల్లి పద్మజ సహకారంతో సురేష్‌ను హైదరాబాద్‌లోని సిటీ న్యూరో సెంటర్‌కు తరలించి, మెరుగైన వైద్యం అందేలా అక్కడి వైద్యులతో మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేశారు. వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో సురేష్ పాటిల్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. చికిత్స సమయంలో బాధితుడి కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆసుపత్రిలో అవసరమైన అన్ని సౌకర్యాలను వరుణ్ తేజ్ కల్పించారు. సురేష్ పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యే వరకు ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అండగా నిలిచారు. వరుణ్ తేజ్ అభిమానుల పట్ల తన సేవా గుణాన్ని చాటుకోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అనంతపురం జిల్లాకే చెందిన మరో అభిమాని మరణించినప్పుడు కూడా వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్నారు. తన పెదనాన్న, మెగాస్టార్ చిరంజీవి సేవా స్ఫూర్తితో వరుణ్ తేజ్ ఇటువంటి కార్యక్రమాలు చేపడుతూ, కష్టకాలంలో అభిమానులను ఆదుకోవడం పట్ల పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.






# 'ఆదర్శ కుటుంబం': వెంకటేశ్ కూతురిగా యువినా పార్థవి.. నవ్వులు పంచుతున్న కొత్త గ్లింప్స్

**వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం'**

**భారీ తారాగణంతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న చిత్రం**

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' (ఏకే 47). తాజాగా ఈ చిత్రం నుంచి మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. చిత్ర యూనిట్ తాజాగా ఈ సినిమాలోని మరో ముఖ్య పాత్రను పరిచయం చేస్తూ ఒక చిన్న వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో వెంకటేష్ కూతురు 'సంపూర్ణ" పాత్రలో నటి యువినా పార్థవిని ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ కొత్త గ్లింప్స్‌లో, చిట్టిబాబు పాత్రలో ఉన్న వెంకటేశ్, రఘుబాబుతో ఇంటి విషయాల గురించి మాట్లాడుతుండగా, వారి కూతురు సంపూర్ణ (యువినా పార్థవి) ఎంతో ఉత్సాహంగా పరిగెత్తుకుంటూ వస్తుంది. "నాన్నా.. నేను ప్రేమలో పడ్డాను" అని తండ్రితో చెబుతుంది. దానికి చిట్టిబాబు చిరాకు పడుతూ, "ఈసారి కార్ డ్రైవర్‌తోనా, మెకానిక్‌తోనా?" అని అడగటంతో ఈ వీడియోలో చూడొచ్చు. తండ్రీకూతుళ్ల మధ్య సాగే ఈ ఫన్నీ సంభాషణ, సినిమా ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందన్న సంకేతాలను ఇస్తోంది. ఈ గ్లింప్స్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. చిత్రబృందం వినూత్నంగా ప్రమోషన్లు నిర్వహిస్తోంది. ఇప్పటికే వెంకటేశ్ ను చిట్టిబాబుగా, ఆయన భార్య స్వర్ణ పాత్రలో శ్రీనిధి శెట్టిని పరిచయం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూతురి పాత్రను కూడా పరిచయం చేయడంతో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో వెంకటేశ్, శ్రీనిధి శెట్టి, యువినా పార్థవితో పాటు నివేదా పేతురాజ్, రాజ్ ప్రజ్వల్, రావు రమేశ్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. తమన్ సంగీతం అందిస్తుండగా, రవి కె. చంద్రన్ సినిమాటోగ్రాఫర్‌గా, శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ఈ పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను 2026 అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com